క్లుప్తంగా

వాటర్ స్పోర్ట్స్ క్రీడాకారులకు ప్రశంసలు



పటమట(విజయవాడతూర్పు): 37వ నేషనల్ గేమ్స్ వాటర్ స్పోర్ట్స్‌లో రజత పతకం సాధించిన క్రీడాకారులు ఎస్.గాయత్రి, భార్గవి, చిన్నాను నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రశంసించారు. కమిషనర్‌ను వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో క్రీడాకారులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానోయింగ్, కయాకిన్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు గెలిచి విజయవాడ పేరు ప్రఖ్యాతులు పెంచారని అభినందించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బలరాం నాయుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జగదీష్, వాటర్ స్పోర్ట్స్ కోచ్‌లు శ్రీనివాస్, బాబురావు ఉన్నారు.

అలరించిన సినీ హీరో కృష్ణ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: సినీ హీరో కృష్ణ నట జీవితం భావి నటులకు ఆదర్శమని డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై బుధవారం సినీ నటుడు కృష్ణ ప్రథమ వర్ధంతి కార్యక్రమం, సినీ సంగీత విభావరి నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ కృష్ణ పేరుతో ప్రభుత్వం ప్రతిభా పురస్కారం ఏర్పాటు చేయలని సూచించారు. గాయకులు విష్ణువర్ధన్, రసూల్‌బాబు, వాసిరెడ్డి శ్రీనివాస్, కేవీబీ ఆనంద్, సుధారాణి, విష్ణుప్రియ, రూపశ్రీ, తదితరులు కృష్ణ నటించిన చిత్రాలలో పాటలను మధురంగా గానం చేశారు. కొప్పుల ఆనంద్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు



పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఇంటివద్దకే వైద్యసేవలను అందిస్తోందని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నగరంలోని 64వ డివిజన్ 282వ సచివాలయం కేవీ కండ్రిక యూపీహెచ్‌సీలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్యశిబిరంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి ఎమ్మెల్యే విష్ణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు 50 వేల మందికి వైద్యపరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ ఇస్మాయిల్, యరగొర్ల శ్రీరాములు, జి.శివ, నరసింహారావు, వెంకటేశ్వరమ్మ, వైద్యులు బాసిద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పవర్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు సన్మానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా క్రీడలలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో విజేతలకు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 13న ఇబ్రహీంపట్నంలో జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళలు, పురుషుల వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు వెయిట్ లిఫ్టింగ్‌లో రెండు స్వర్ణ, ఒక రజత, మూడు కాంస్య పతకాలతో పాటు పవర్ లిఫ్టింగ్‌లో ఏడు రజత, రెండు కాంస్య పతకాలు సాధించారన్నారు. పవర్ లిఫ్టింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం, వెయిట్ లిఫ్టింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్ ద్వితీయస్థానం సాధించటం అభినందనీయం అని అన్నారు. అనంతరం విజేతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య విభాగాధిపతి మండవ కోటేశ్వరరావు, డాక్టర్ యుగంధర్ ప్రభుత్వ హాస్పిటల్ వైద్యుడు సీహెచ్‌బీవీ సారథి పాల్గొన్నారు.

ఐలా కమిషనర్‌గా మధు

ఆటోనగర్ (విజయవాడ తూర్పు): జవహర్ ఆటోనగర్‌లో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని ఐలా కమిషనర్ ఎం.మధు తెలిపారు. ఆయన ఐలా కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికవాడలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏడాది నుంచి ఐలా ఇన్‌చార్జి కమిషనర్‌గా ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విధులు నిర్వహిస్తున్నారు. ఇన్నాళ్లకు కమిషనర్‌ను నియమించారు.

విశ్వసనీయతకు నిలువెత్తు నిదర్శనం సీఎం జగన్

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 32వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విలువలు, విశ్వసనీయతకు నిలువెత్తు నిదర్శనం సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని, దేశంలోనే 99.5 శాతం హామీలను అమలు చేసి విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 32 వ డివిజన్ అయోధ్యనగర్ 228 వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కోఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి, వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండె సుందర్ పాల్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత అగ్రిగోల్డ్ శివాలయం వద్ద మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. సచివాలయాన్ని సందర్శించి సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా చేసిన మంచిని గణాంకాలతో సహా వివరించే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా చేసిన మంచిని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలపడాన్ని వివరిస్తూ 24 పేజీలతో రూపొందించిన పుస్తకాన్ని ప్రతిఒక్కరికీ అందించారు. పేదింటి బిడ్డలు ఉన్నత చదువులు చదవాలన్నా, ఖరీదైన వైద్యం నిరుపేదలకు చేరువ కావాలన్నా, అవ్వాతాతలకు గుమ్మం వద్దకే పింఛన్ రావాలన్నా, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమం అందాలన్నా ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్నే రావాలని మల్లాది విష్ణు అన్నారు. అధికారంలోకి వస్తే పేదలను కోటీశ్వరులను చేస్తానంటున్న చంద్రబాబు మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎంత మంది పేదల్ని కోటీశ్వరులను చేశారో సమాధానం చెప్పగలరా..? అని ప్రశ్నించారు. 2014లో వ్యవసాయ, డ్వాక్రా రుణాలను మాఫీ చేయకుండా వారిని బాబు నిలువునా మోసగించిన తీరును వివరించారు.తమ ప్రభుత్వం వచ్చాక సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రంలో పేదరికం 11.77 శాతం నుంచి 6.06 శాతానికి తగ్గిందని విష్ణు అన్నారు. గత నాలుగున్నరేళ్లలో 228 వ వార్డు సచివాలయ పరిధిలో 1,303 మందికి 4 కోట్ల 28 లక్షల 15 వేల 118 రూపాయలు డీబీటీ ద్వారా లబ్ధి చేకూర్చినట్లు వెల్లడించారు. నాన్ డీబీటీ ద్వారా 760 మందికి 3 కోట్ల 31 లక్షల 73 వేల 133 రూపాయలు.. మొత్తంగా 2,063 మందికి 7 కోట్ల 59 లక్షల 88 వేల 252 రూపాయల లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.మురళీకృష్ణంరాజు, పేరం త్రివేణి రెడ్డి, గవాస్కర్, వెంకటేశ్వర రెడ్డి, రంగబాబు, గుడిసె శ్యాం, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటే వైద్య సేవలు

కార్పొరేటర్ శర్వాణిమూర్తి



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శర్వాణిమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందిస్తున్నారని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి అన్నారు. నగరంలోని 33వ డివిజన్‌లోని విజ్ఞాన విహార్ పాఠశాలలో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ ప్రజలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అనంతరం వైద్య సేవలు పొందిన వారికి మెడికల్ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు, పలు విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

'చేయూత'లో ప్రత్యేక చిన్నారుల సందడి



మధురానగర్(విజయవాడసెంట్రల్):అయోధ్యనగర్ లోటస్‌ల్యాండ్ మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక చిన్నారులతో బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణకుమారి బాలల దినోత్సవ విశిష్టతను వివరించారు. ప్రత్యేక చిన్నారులను కూడా మామూలు చిన్నారులతో సమానంగా తీర్చిదిద్దటానికి తాము బాలల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రత్యేక చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. దీపావళి పురస్కరించుకుని బాణసంచా కాల్చుతూ నృత్యాలు చేశారు.

భావయుక్త పద్యంతోనే రసానుభూతి



తెలుగు పద్యనాటకం అంశంపై ప్రసంగిస్తున్న డాక్టర్ అక్కిరాజు సుందరరామ శర్మ

విజయవాడ కల్చరల్: భావయుక్త పద్యంతోనే ప్రేక్షకులకు రసానుభూతి కలుగుతుందని నాటక రంగ ప్రముఖుడు డాక్టర్ అక్కిరాజు సుందర రామ కృష్ణ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం తెలుగు పద్య నాటకం అంశంగా సమావేశం నిర్వహించారు. సుందరరామ శర్మ మాట్లాడుతూ సత్యహరిశ్చంద్ర, గయోపాఖ్యానం లాంటి పద్యనాటకాలను తెలుగు ప్రేక్షకులు ఆదరించారన్నారు. నేటి కాలంలో చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే పద్యనాటకాలు ప్రదర్శనలకు నోచుకుంటున్నాయన్నారు. పౌరాణిక నాటకంలో పాత్రల హావభావాలను ప్రేక్షకులు గమనిస్తారని, పాత్రలను బట్టి నవరసాలకు అనుగుణంగా పద్యాలను వినిపించాల్సి వస్తుందన్నారు. నాటక రచయిత డాక్టర్ పీవీఎస్ కృష్ణ మాట్లాడుతూ యువతను నాటక రంగం వైపు మళ్లించాల్సిన అవసరముందన్నారు. పద్యనాటకంలో ఆధునిక అవసరాలకు తగినట్లుగా నాటకంలో సాంకేతిక విప్లవం తీసుకురావాలని సూచించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు తెలుగు పద్యనాటకం అంశంగా ప్రసంగించారు. హనుమంతరాయ గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు మాట్లాడుతూ ఇదే గ్రంథాలయంలో వేలాది పద్య నాటకాలు ప్రదర్శించినట్లు తెలిపారు. కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ వెన్నా వల్లభరావు, హనుమంతరాయ గ్రంథాలయం కార్యదర్శి నీలం దుర్గారావు పాల్గొన్నారు.

తెలుగు హాస్యానికి చిరునామా ముళ్లపూడి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగు హాస్యానికి చిరునామా ముళ్లపూడి వెంకటరమణ అని ప్రముఖ సాహితీ విమర్శకురాలు సిహెచ్ సుశీలమ్మ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ పుస్తక వారోత్సవాల్లో భాగంగా సొసైటీ గ్రంథాలయం ఆవరణలో 'ముళ్లపూడి హాస్య రచనలు' అంశంపై బుధవారం సాయంత్రం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుశీలమ్మ మాట్లాడుతూ.. ముళ్లపూడి వెంకటరమణ అందించిన సాహిత్యంలో హాస్యం అద్భుతమని కొనియాడారు. చిత్రకారుడు, దర్శకుడు బాపు సహచర్యంతో ముళ్లపూడి అనేక అపూర్వ రచనలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. తెలుగు సాహిత్యంలో ముళ్లపూడి హాస్యం చెరగని ముద్ర వేసిందన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన సాహితీవేత్త నండూరి రాజగోపాల్ మాట్లాడుతూ.. ముళ్లపూడి, బాపు సాగించిన సాహితీ కృషి అమోఘమన్నారు. రచయిత జి.వి.పూర్ణచంద్, సంస్థ గౌరవాధ్యక్షుడు బెల్లపు బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా బ్యాంకు శతాబ్ది ఉత్సవ ర్యాలీ



ఆంధ్రా బ్యాంకు శతాబ్ది ఉత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న రిటైర్డ్ సర్కిల్ జీఎం నాంచారయ్య

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్ర బ్యాంక్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆంధ్ర కార్పొరేషన్ యూనియన్ బ్యాంక్ రిటైర్డ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆంధ్ర బ్యాంక్ రిటైర్డ్ సర్కిల్ జనరల్ మేనేజర్ కె. నాంచారయ్య తెలిపారు. అందులో భాగంగా బుధవారం బిషప్ అజరయ్య పాఠశాల నుంచి సీతారాంపురం ఆంధ్ర బ్యాంక్ శాఖ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని నాంచారయ్య జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బందరులో భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆంధ్ర బ్యాంకును ప్రారంభించారని, ఆ తరువాత వేలాది శాఖలుగా విస్తరించిందని తెలిపారు. వేల మందికి ఉపాధి కల్పించిన గొప్ప వ్యక్తి పట్టాభి సీతారామయ్య అని కొనియాడారు. బ్యాంకింగ్ సేవలను ప్రజలకు చేరువ చేసిన ఏకైక వ్యక్తిని ప్రశంసించారు. 97వ సంవత్సరంలో ఆంధ్ర బ్యాంకును యూనియన్ బ్యాంకులో విలీనం చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర బ్యాంకును ప్రారంభించి వంద సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. అసోసియేషన్ కన్వీనర్ జొన్నలగడ్డ వెంకటరత్నం మాట్లాడుతూ.. ఈ నెల 18న ఏలూరు రోడ్డులోని మిషనరీస్ ఆఫ్ చారిటీలో పేదలకు పండ్లు, స్వీట్స్ పంపిణీ చేస్తామన్నారు. 19న బ్యాంక్ ప్రస్తుత జనరల్ మేనేజర్లు, రిటైర్డ్ జనరల్ మేనేజర్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహిస్తామని, 20న కానూరులోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజన సౌకర్యం కల్పిస్తామని, 23వ తేదీన ఆంధ్ర బ్యాంక్ జోనల్ కార్యాలయంలో భోగరాజు పట్టాభి సీతారామయ్య సిల్వర్ కాయిన్‌ను విడుదల చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీజీఎం ఎ.సత్యనారాయణ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లినికల్ రీసెర్చ్‌తో ఉజ్వల భవిష్యత్తు

సాక్షి, అమరావతి: క్లినికల్ రీసెర్చ్‌ను కెరీర్‌గా తీసుకునే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని కావాక్సియన్ క్లినికల్ రీసెర్చ్ సంస్థ డైరెక్టర్ కరిష్మా రాంపల్లి అన్నారు. విజయవాడలోని సిద్ధార్థ మహిళా కళాశాలలో 'క్లినికల్ రీసెర్చ్' అంశంపై మూడు రోజుల వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కరిష్మా మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని అధ్యయనం చేయడంలో క్లినికల్ రీసెర్చ్ ఎంతో కీలకమన్నారు. కొత్త వ్యాధులకు చికిత్స, నిరోధించడానికి కొత్త మందుల తయారీలో కీలక భాగస్వామ్యం ఉంటుందన్నారు. ప్రాణాంతక వ్యాధి, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యతో జీవిస్తున్న వ్యక్తుల జీవన నాణ్యతను మెరుగుపరచడంలో అనేక పరిశోధనలు సాగుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే క్లినికల్ రీసెర్చ్ విద్యార్థులకు అంతర్జాతీయ వ్యాప్తంగా విస్తృత అవకాశాలున్నాయని వివరించారు. గెస్ట్ లెక్చరర్‌గా తన్మయ్ క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం క్లినికల్ రీసెర్చ్‌లో హాండ్స్ ఆన్ ట్రైనింగ్ అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు.

సింగ్‌నగర్‌లో ఘనంగా హీరో కృష్ణ ప్రథమ వర్ధంతి



స్థానికులకు పండ్లు పంపిణీ చేస్తున్న బాబూరావు



సూపర్‌స్టార్ కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తెలుగు చలన చిత్ర స్థాయిని పెంచి, తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప నటుడు సూపర్‌స్టార్ కృష్ణ అని అన్నారు. సినీ హీరో, సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ ప్రథమ వర్ధంతి కార్యక్రమం సింగ్‌నగర్ డాబా కొట్ల సెంటర్ వద్ద కృష్ణ అభిమాని కె.నాగమణి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎవర్ గ్రీన్ హీరో కృష్ణ కల్చరల్ అసోసియేషన్, సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ సేన జిల్లా అధ్యక్షుడు దొంతరాజు బాబూరావు అభిమానులతో కలిసి కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు సినిమాను ప్రపంచంతో పోటీపడేలా చేసేందుకు తొలి అడుగు వేసిన వ్యక్తి కృష్ణ అని అన్నారు. కృష్ణ విగ్రహ ఏర్పాటుకు స్థల సేకరణ చేస్తున్నామని, త్వరలోనే ఆయన విగ్రహాన్ని ఆవిష్కరిస్తామన్నారు. అనంతరం స్థానికులకు పండ్లు పంపిణీ చేసి, అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో బుదాల శ్యాంసన్, బుట్టి, చింత కృష్ణ, నీరజ, కృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆలిండియా సూపర్ స్టార్ కృష్ణ–మహేష్‌బాబు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాస్వామి ఆధ్వర్యంలో సినీ నటుడు కృష్ణ ప్రథమ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. లెనిన్ సెంటర్‌లోని సాయిబాబా ఆలయంలో కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు కృష్ణ అభిమానులు అన్నదానం, మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. అనాథ ఆశ్రమాల్లో వృద్ధులకు పండ్లు, కేకులు, బ్రెడ్లు పంచారు. ఈ సందర్భంగా సుధాస్వామి మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణ సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ అభిమానులు శీరం బుజ్జి, తాడి శివ, కృష్ణ, విజయ్, టైలర్, వాణి, బసవయ్య, సాయి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాలనకు చిరునామా ఆంధ్రప్రదేశ్

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు
- 58 వ డివిజన్ 239 వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం



అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దేశంలో ఆదర్శ పాలనకు కేరాఫ్ అడ్రస్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అని, ఆంధ్రప్రదేశ్‌కి జగనన్న బ్రాండ్ అంబాసిడర్ అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నగరంలోని 58 వ డివిజన్‌లో 239వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన తోట వారి వీధిలో పర్యటించారు. మొత్తం 110 గడపలను సందర్శించి, పలు అపార్ట్ మెంట్ల అసోసియేషన్ సభ్యులతో మాట్లాడి వారి నుంచి అర్జీలు స్వీకరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కేవలం మాటలకు మాత్రమే పరిమితమైందని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.22 కోట్ల మేర అభివృద్ధి పనులను ఈ డివిజన్‌లో చేపట్టినట్లు ఎమ్మెల్యే వారికి వివరించారు. డివిజన్ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, వీధి దీపాలు సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని, రానున్న రోజుల్లో ఈ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఈఈ(ఇంజనీరింగ్) శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, ఉమ్మడి వెంకట్రావు, తోట వెంకటేశ్వరరావు, వసంత్, శర్మ, గోపిరెడ్డి, తోపుల వరలక్ష్మి, శోభన్, యక్కల మారుతి, మహేశ్వరి, ఇతర నాయకులు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చు

రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శంఖబ్రాత



శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ వార్షికోత్సవాల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏడీజీపీ శంఖబ్రాత

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదివితే జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శంఖబ్రాత సూచించారు. నగరంలోని శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శంఖబ్రాత సివిల్స్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. తమ యాటిట్యూడ్‌ను ఎలా సరిచేసుకోవాలి వంటి అంశాలను వివరించారు. సివిల్స్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు, గ్రూప్–1 వంటి ఇతర పోటీ పరీక్షల్లో సులువుగా విజయం సాధించొచ్చని సూచించారు. సివిల్స్ లక్ష్యంతో ప్రతి విద్యార్థీ కృషి చేస్తే కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగం సాధించే అవకాశం ఉందన్నారు. అందుకోసం కృషి, పట్టుదల, నిరంతర సాధన, ఆత్మ విశ్వాసం అవసరమని స్పష్టం చేశారు. శరత్ చంద్ర అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర మాట్లాడుతూ.. నిజాయతీ కలిగిన సీనియర్ ఐపీఎస్ అధికారి శంఖబ్రాత వంటి అధికారి సివిల్స్ సాధించాలనే ఆశయంతో శిక్షణ పొందుతున్న వారికి సూచనలు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆయన చేసిన గుడ్ గవర్నెన్స్ విద్యార్థులకు స్ఫూర్తిదాయమన్నారు. తమ విద్యా సంస్థలో నాలుగేళ్లలో వందకు పైగా ఐఏఎస్, 90కి పైగా గ్రూప్–1 ర్యాంకులు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థలో శిక్షణ పొంది సివిల్స్‌లో ర్యాంకులు సాధించిన వారిని సత్కరించారు.

పఠనాసక్తి పెంచేందుకే పుస్తక ప్రదర్శన

ప్రారంభించిన జేసీ డాక్టర్ సంపత్‌కుమార్



పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న జేసీ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పుస్తకాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించడం, పఠనాసక్తి పెంచాలనే ఉద్దేశంతో ఏటా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రెండో రోజు పుస్తక ప్రదర్శన జరిగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు ప్రియనేస్తాలని, చైతన్య దీప్తులని అన్నారు. పుస్తకాలు దారి చూపే దివ్వెలని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవరచుకోవాలని కోరారు. పుస్తకం చదవడం ద్వారా జ్ఞానం సముపార్జించవచ్చన్నారు. అనంతరం జేసీ సంపత్‌కుమార్‌ను ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ, సంస్థ కార్యదర్శి యం.వి.డి.టి.నగేష్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవరుచుకోవాలి



రామకృష్ణాపురం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం కళ్ళేపల్లి శేషంరాజు స్మారక గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బుధవారం కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన పుస్తక ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఎస్.కళ్యాణి లక్ష్మి గ్రంథాలయ వారోత్సవాల విశిష్టతను వివరించారు. పుస్తక ప్రదర్శన వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చిన జగన్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. విలేజి కండ్రికలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం బాలల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల కోసం గడిచిన నాలుగున్నరేళ్లలో 65 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేశారన్నారు. విద్యార్థులకు చేస్తున్న సదుపాయాలను చూసి గిట్టని వారు అవినీతి జరిగిందని, నానిరకమని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ సదుపాయాలను ఉపయోగించుకుని విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, సొసైటీ చైర్మన్ ఎం.రవీంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు యరగొర్ల శ్రీరాములు, పాలకేంద్రం అధ్యక్షుడు దేవిరెడ్డి మంగారెడ్డి, పిన్నిబోయిన కృష్ణ, మరీదు వీరయ్య, గ్రామ పెద్దలు, ఎంఈఓ సూరిబాబు, హెచ్ఎం కరుణశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ప్రకృతి సాగు

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో ప్రకృతి సాగు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆకుకూరలు, కూరగాయలు పండించి ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఏటీఎం పద్ధతిన చేపట్టిన ప్రకృతి సాగును బుధవారం కలెక్టర్ పరిశీలించారు. కలెక్టరేట్‌లో ఖాళీగా ఉన్న స్థలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఇదే విధానాన్ని జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమలుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో విజయం సాధించిన రైతుల విజయగాథలను ఇతర రైతులకు తెలియజెప్పేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఏవో ఇంతియాజ్ పాషా, కలెక్టరేట్ సిబ్బంది ఉన్నారు.

స్థానిక కళింగ వైశ్యులకు బీసీ-బీ' కేటాయింపుపై హర్షం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఉత్తరాంధ్ర మూడు జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన కళింగ వైశ్యులకు మాత్రమే వర్తించే బీసీ–బీ కేటగిరీని రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో ఉన్న కళింగ వైశ్యులందరికీ వర్తించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీఓ జారీచేయడంపై కళింగ వైశ్య పెద్దలు హర్షం వ్యక్తంచేశారు. ఈ అంశంపై ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు గతంలో అర్జీ సమర్పించగా ఆయన దానిని అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారని, సీఎం జగన్ దీనిపై సానుకూలంగా స్పందించి జీఓను విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈ జీఓ అమలులోకి వస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విజయవాడ నగర వైఎస్సార్‌సీపీ కళింగ వైశ్య నాయకులు బుధవారం ఆంధ్రప్రభ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి ఆయన్ను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కళింగ వైశ్యులంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా ఉంటామన్నారు.